వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 28
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
అక్టోబర్ 10, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## ఘనంగా కేశవమూర్తి జన్మదిన వేడుకలు



సీనియర్ జర్నలిస్ట్, రాష్ట్ర అవార్డు గ్రహీత, రచయిత, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తికి జన్మదిన వేడుకలను గురువారం రాత్రి వరంగల్ వాయిస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శాలువాతో కేశవ మూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, హనుమకొండ స్టాఫ్ రిపోర్టర్ సిద్దోజు రాకేష్, ప్రజాకళం రిపోర్టర్ ముంజాల అనిల్, ప్రజాపక్షం జర్నలిస్ట్ కె.రాజు పాల్గొన్నారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ

# అంబరాన్నంటిన.. బతుకమ్మ సంబురం










- పులకించిన మహిళాలోకం
- ఆట, పాటలతో సందడి
- తీరొక్క పూలతో బతుకమ్మల ఏర్పాటు
- పూల వనాలుగా మారిన గ్రామాలు, పట్టణాలు
- భారీ ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం



సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఊరూ, వాడా..ధనిక, పేద..చిన్నా, పెద్దా తారతమ్యాలు లేకుండా మహిళాలోకమంతా రంగు రంగుల పూలను ఒద్దికగా పేర్చి బతుకమ్మలను తయారు చేశారు. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలపైన పసుపుతో తయారు చేసిన గౌరమ్మను ఏర్పాటు చేసి పూజలు చేశారు. సాయంత్రం మేళ, తాళాలతో చెరువు గట్టుకు చేరుకుని రాగయుక్తమైన పాటలకు లయబద్ధమైన తాళం వేస్తూ మహిళలు ఆడి పాడారు. వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు, కళాకారులు అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ తీరొక్క పూవేసి చందమామ అంటూ పాటలు పాడారు. దీంతో ఆయా ప్రాంతాలు బతుకమ్మ పాటలతో మారుమ్రోగాయి. పూల సింగిడి నేలకు తాకిందా అన్నట్లుగా పల్లె, పట్టణ ప్రాంతాలన్నీ బతుకమ్మలతో మురిసిపోయాయి. మహిళలు, యువతుల కేరింతలతో ఊర్లన్నీ సందడిగా మారాయి. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండువగా గుర్తించినందున రాష్ట ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. బతుకమ్మలు ఆడే స్థలాల్లో కావాల్సిన లైటింగ్ తోపాటు డీజే సౌండ్ లను ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

–వరంగల్ వాయిస్, నెట్ వర్క్




మూర్తీభవించిన రూపం.. చెక్కు చెరగని చిరునవ్వు.. మీ ఆదర్శ జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. అన్నా అని పిలిస్తే నేనున్నానంటూ అండగా నిలిచే మనస్థత్వం.. ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకునే నైజం.. వరంగల్ జర్నలిస్ట్ లోకానికే పెద్దన్నగా ప్రత్యేక గుర్తింపు పొందడమే కాకుండా తమ్ముడూ అంటూ అందరినీ ఆప్యాయతగా పిలిచే సీనియర్ జర్నలిస్ట్, రాష్ట అవార్డు గ్రహీత, రచయిత, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో కలకాలం జీవించాలని కోరుకుంటూ..

వరంగల్ వాయిస్ Evening Daily

ఇట్లు :
జర్నలిస్టులు, సిబ్బంది
మరియు
కుటుంబ సభ్యులు,
బంధుమిత్రులు



## బిందు సేద్యంతో అధిక దిగుబడులు

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

గీసుగొండ, ఖిలా వరంగల్ మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన



## కాంట్రాక్టర్ల వలలో.. ఘనప సముద్రం చేపలు

నష్టపోతున్న మత్స్యకారులు



# అంబరాన్నంటిన.. బతుకమ్మ సంబురం



**వరంగల్ వాయిస్, నెట్ వర్క్ :** ఇంద్ర ధనస్సులోని వర్ణాలు కలిగిన రకరకాల పూలతో అలంకరించిన బతుకమ్మ ఇవాళ జగమేలుతోంది. తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. తెలంగాణ సంప్రదాయన్ని విదేశాల్లోనూ పాటిస్తున్నారు. అక్కడ స్థిరపడిన మనోళ్లంతా బతుకమ్మ పండగను అంగరంగా వైభవంగా జరుపుకుంటున్నారు. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ, ఏమేమి కాయప్పునే గౌరమ్మ అంటూ ఒకసారి, చిత్తూ చిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ, ఒక్కోసి పువ్వేసి సందమామ అని, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో అంటూ ఇలా బతుకమ్మ పాటలతో ఆయా ప్రాంతాలు మారుమోగుతున్నాయి. బతుకమ్మ.. ఓ సంబురం.. సంతోషం.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక.. సగటు తెలంగాణ ఆడపడుచుకు ఇంతకంటే పెద్ద పండగ ఏదీ లేదని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను దేవతగా కొలిచే అరుదైన పండుగ అన్నారు. తీరొక్క పూలను తెచ్చి.. అందంగా పేర్చి.. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆటపాటలతో భక్తి శ్రద్ధలతో ప్రకృతిని, పూలను పూజించే గొప్ప పండుగ.

### బతుకమ్మ పేర్చిన ప్రముఖులు..

బతుకమ్మ పండుగలో చివరి రోజు గురువారం సద్దుల బతుకమ్మ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్వయంగా బతుకమ్మను పేర్చారు. తెలంగాణ ఆడపడుచులందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ సంతోషకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి తన కోడలుతో కలిసి రామన్నపేటలోని తన స్వగృహంలో బతుకమ్మ పేర్చారు. నగరంలోని 32వ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ–రవి తన స్వగృహంలో బతుకమ్మను పేర్వగా, శివనగర్ లో మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషా శ్రీనివాస్ పూలతో బతుకమ్మను అందంగా అలకరించారు. బతుకమ్మలో పూలు ఎలా ఒదిగి వుంటాయో ఆడపడుచులు పులమాదిరిగా జీవితంలో ఒదిగి సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. తెలంగాణ పండుగల ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను తమ పిల్లలకు నేర్పించాలన్నారు.

### గణపురంలో..

మండల కేంద్రంలో గురువారం సద్దుల బతుకమ్మ పండుగను గృహలక్ష్మిలు భక్తి శ్రద్ధలతో వైభవపేతంగా జరుపుకున్నారు. పట్నంలోని దాదాపు ప్రతి ఇంటి నుంచి భారీ బతుకమ్మలతో ప్రవాహంలో వేలాదిగా తరలివచ్చారు. బతుకమ్మ ఆడే ప్రదేశంలో మహిళలకు స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఈ ప్రాంతాన్ని సందర్శించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేపాక రాజేందర్, నాయకులు వి.నారాయణ, శివశంకర్, దేవేందర్, అశోక్ , శ్రీనివాస్, రాజమౌళి, మహేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలు

ఆనందాలకు కొంగుబంగారమై
సాంస్కృతిక నేపథ్య వారధియై
జానపదుల జీవన పరిమళమై
పల్లెవాసుల రాగ శోభితమై
శతాబ్దాల చరితకు సంకేతంగా
అవధులు లేని సంబరాలతో
ఎంగిలిపూలతో సందడి చేసిన
సద్దుల బతుకమ్మతో వీడ్కోలు పలికిన
అలతి పదాల సింగారాలతో
ప్రకృతి ఆరాధనల ఒయ్యారాలతో
సనాతన వారసత్వపు దిక్సూచిగా
ఇంటి దేవతలను రంజింప చేయగా
బొమ్మల కొలువుతో సందడి చేయగా
పిల్లాపాపల ఆనందోత్సవాలు!
అతివల్లో ఉత్తేజం ఉప్పొంగగా
చప్పట్లు, కోలాటాల సంబరాలు!
అంబరాన్నంటే ఆనంద పారవశ్యాలు!
మరపురాని ఓ మధురానుభూతిని
పంచిన క్షణాలు!!

**- పరాంకుశం రఘు నారాయణ,** తొర్రూరు



























# పుట్టిన రోజున హెల్మెట్ల పంపిణీ

## డాక్టర్ మౌనిక ఔదార్యం



**వరంగల్ వాయిస్, కాటారం :** పుట్టినరోజు పండుగను ఒక ప్రత్యేకతగా జరుపుకోవాలని కాటారం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ మౌనిక భావించారు. తను అనుకున్నదే తడవుగా కాటారం మండల కేంద్రంగా పనిచేస్తున్న స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థను సంప్రదించారు. దాంతో సదరు సంస్థ నిర్వాహకులు కొట్టే సతీష్ ఒక వినూత్నమైన ఆలోచనను డాక్టర్ తో చర్చించారు. తరచుగా జరుగుతున్న ప్రమాదాల బారి నుంచి యువతను కాపాడేందుకు హెల్మెట్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ ఆలోచన బాగుందని డాక్టర్ మౌనిక గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దాంతో తన పుట్టినరోజు కానుకగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గారేపల్లి యువతకు హెల్మెట్ల పంపిణీ చేపట్టారు. డాక్టర్ మౌనిక విక్రం దంపతుల ఔదార్యం పట్ల స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు కొట్టే సతీష్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా డాక్టర్ మౌనికకు శుభాకాంక్షలు తెలిపారు.



# కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనతో ఆనందం

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ప్రజల చిరకాల కోరిక నెరవేరే రోజు వచ్చింది. అయోధ్య పురం వద్ద నిర్మిస్తున్న వ్యాగన్ తయారీ కేంద్రాన్ని అప్ గ్రైడ్ చేసి కోచ్‌లు తయారీ చేయాలని కేంద్రం భావిస్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనతో ఓరుగల్లు వాసుల్లో ఆనందం వెల్లువిరుస్తుందని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ తెలిపారు. వందే భారత్ రైల్ కోచ్ లు ఇక్కడే తయారు చేయాలనే భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించడం కాజీపేట, వరంగల్ జిల్లాకు గొప్ప మలుపు అని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ అన్నారు.

# ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు

## జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణలో బీసీ సామాజిక ఆర్థిక కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి, క్యాబినెట్ మంత్రుల అందరికీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలందరికీ జిల్లా కాంగ్రెస్ నాయకుడు, బీసీ నేత సాయిలి ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఏళ్ల తరబడి బీసీ ప్రజలు కోరుకునే కుల సర్వే ప్రక్రియ ద్వారా బీసీలకు ఎంతో మేలు జరగనుందని, బీసీ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని,ఈప్రక్రియ ద్వారా సామాజికంగా, రాజకీయంగా బీసీలు ముందు వరుసలో ఉంటారన్నారు.

# రంగశాయిపేటలో రావణవధకు ఏర్పాట్లు పూర్తి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విజయదశమి పండుగ శనివారం రోజున సాయంత్రం రంగశాయిపేటలోని మహంకాళి గుడి ఆవరణలో నిర్వహించే రావణవధ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ తెలిపారు. గురువారం మహంకాళి గుడి ఆవరణలో రావణవధ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఉత్సవ సమితి ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగానే ఈ సంవత్సరం విజయ దశమి పండుగ శనివారం సాయంత్రం 7:30 నిమిషాలకు రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 36 ఫీట్ల రావణ ప్రతిమను ఏర్పాటు చేస్తున్నామని అదేవిధంగా మిరిమిట్లు గొలిపే బాణాసంచాలతో పాటు సంస్కృతిక, ఆర్కెస్ట్రా ప్రోగ్రాంలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ మురళీధర్ రావు, విశిష్ట అతిథిగా గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, గౌరవ అతిథులుగా వరంగల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ కడియం కావ్య, శాసనమండలి సభ్యులు బసవరాజు సారయ్య, ప్రత్యేక అతిథులుగా జగిత్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కంచప్రసాద్, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్, సీనియర్ పాత్రికేయులు శంకేసి శంకర్ రావులు విచ్చేస్తున్నారని తెలిపారు. ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి దామెరకొండ కరుణాకర్ మాట్లాడుతూ దసరా పండుగ రోజున సాయంత్రం 6:30 నిమిషాలకు మా ఉత్సవ సమితి ప్రతినిధులచే ముందుగా శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా మహంకాళి మైదానానికి చేరుకుంటారన్నారు. అనంతరం అతిథులచే రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అత్యంత వైభవంగా నిర్వహించే ఈ రావణవధ కార్యక్రమానికి రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అన్ని కాలనీల నుంచి ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు ముత్తినేని రామమూర్తి, కొక్కొండ భాస్కర్, పరికిపండ్ల రాజేశ్వర్ రావు, బీవీ రామకృష్ణ ప్రసాద్, మండల లక్ష్మయ్య, కంచ రమేష్, బజ్జూరి వీరేశం, పాకాల మనోహర్, పస్తం భిక్షపతి, కత్తెరపల్లి వేణు, ఏలుగు అశోక్, పూసల కిరణ్, గుండు నవీన్ కుమార్, దేవునూరి వెంకటేశ్వర్లు, ఆడెపు రఘు, కన్నెబోయిన కుమార్, ఇట్టబోయిన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకు అండగా ప్రభుత్వం



## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 23 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.8 లక్షల 50 వేల 500 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎస్సార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఈ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని, బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని ప్రగతిసింగారం గ్రామం నుంచి సుమారు 100 మంది బీఆర్ఎస్ నాయకులు గురువారం గ్రామంలోని కాంగ్రెస్ ముఖ్య నేత బోనపెల్లి రఘుపతి రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కండువా కప్పి ఆహ్వానించారు. కాగా, పార్టీలో చేరిన వారిలో ఎలమంచి జయపాల్ రెడ్డి (పీఏసీఎస్ డైరెక్టర్), బత్తిని కుమార్(వార్డు మెంబర్), డా.సమ్మయ్య, ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు. ప్రగతి సింగారం గ్రామ యూత్ నేత మూలగండ్ల సందీప్ బర్త్ డే వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేకు కోసి సందీప్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మండలంలోని మాందారిపేట గ్రామంలో గ్రామ పంచాయతీ ఎదురుగా ఏర్పాటు చేసిన దుర్గా దేవి అమ్మవారిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. దుర్గా దేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. మండలంలోని మైలారం, ప్రగతిసింగారం, గట్లకానిపర్తి గ్రామాలల్లో బతుకమ్మ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

# గౌడ కులస్తులను అన్ని విధాల అందుకుంటాం




## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
## గీత కార్మికులకు రక్షా కిట్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో శిక్షణ పొందిన గీత కార్మికులకు కాటమయ్య రక్షా (భద్రత కిట్ ) వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ పంపిణీ చేశారు. అనంతరం యాదగిరి గౌడ్ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరడం జరిగింది. ఎమ్మెల్యే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గౌడ కులస్తులను గత ప్రభుత్వం విస్మరించదన్నారు. గౌడ కులస్తులను అన్ని విధాల అందుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ హనుమకొండ జిల్లా డీడీ శ్రీ రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా ఎక్సైజ్ సూపరడెంట్ చంద్ర శేఖర్, హనుమకొండ ఎక్సైజ్ సీఐ దుర్గా భవాని, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి బయ్యాగోని కుమారస్వామి గౌడ్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు నాగపూరి రాజయ్య గౌడ్, తెలంగాణ గౌడ సంఘం, తెలంగాణ గౌడ సంఘం నాయకులు జనగాం రమేష్ గౌడ్, బుర్ర రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# హిమబిందుకు ఉత్తమ డాక్టర్ పురస్కారం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** అమెరికా హూస్టన్ లోని ప్రసిద్ధ మెథోడిస్ట్ హాస్పిటల్ లో హృద్రోగ శస్త్ర చికిత్సల స్పెషలిస్ట్ గా సేవలందిస్తున్న డాక్టర్ హిమబిందు చేబ్రోలు కు "బెస్ట్ డాక్టర్ ఆఫ్ ఇయర్ 2023" పురస్కారాన్ని జోష్ నేషనల్ అకాడమీ అందజేసింది. బుధవారం నాడు రాత్రి కన్నుల పండుగగా నగరంలోని ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు అవార్డును స్వీకరించారు. జోష్ నేషనల్ అకాడమీ ప్రతి ఏటా దేశ విదేశాలలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందిస్తున్న ప్రముఖ వ్యక్తులకు ఉత్తమం పురస్కారాలను అందజేస్తోంది. 2023 సంవత్సరానికి గాను అవార్డుల కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ కమిషన్ పూర్వ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు , విశిష్ట అతిథిగా ప్రముఖ సినీ నేపథ్య పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ, భూగర్భ వనరుల నిపుణులు, శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ఎం రావు తదితరులు పాల్గొని అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ప్రసంగిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన హూస్టన్ మెథొడిస్ట్ హాస్పిటల్ లో ఒక కీలక విభాగానికి డైరెక్టర్ స్థాయిలో సేవలందిస్తున్న తెలుగు అమ్మాయి డాక్టర్ హిమబిందుకు పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనేక శస్త్ర చికిత్సలలో వైద్యురాలిగా హిమబిందు కీలకంగా వ్యవహరించటం గొప్ప విషయమన్నారు. అనేక అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని హిమబిందు సమర్పించిన అధ్యయన పత్రాలు అనేక ప్రశంసలు అందుకున్నాయన్నారు. అంతర్జాతీయ జనరల్స్ లో ప్రచురుతమవడం గొప్ప విశేషమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా సంజోష్, చిరంజీవులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ నృత్య గురువు స్వర కళ్యాణి పర్యవేక్షణలో ప్రదర్శించిన సనాతన భారతీయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, జానపద కళారూపాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ



**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** ప్రపంచ వ్యాప్తంగా నేడు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకొంటున్న బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నల్లబెల్లిలోని తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గ ఆడపడుచులకు బతుకమ్మ దసరా, శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాన్షీరామ్ సిద్ధాంతాలు ఆదర్శనీయం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ జిల్లా కాశిబుగ్గ అంబేద్కర్ జంక్షన్ లో గురువారం కాన్షీరామ్ 18వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కేడల ప్రసాద్ మాట్లాడుతూ బహుజనులు రాజ్యాధికారం సాధించాలంటే అది ఒక్క కాన్షిరాం సిద్ధాంతం ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. కాన్షీరామ్ దేశం అంతా తిరిగి దళిత బహుజనులకు అంబేద్కర్ రాజ్యాంగంలో పొందు పరిచిన ప్రాథమిక హక్కులని ప్రచారం చేశారన్నారు. ఇప్పటికైన దేశ, రాష్ట్ర ప్రజలు జనాభాలో నూటికి 5శాతం కూడా లేని అగ్ర వర్ణాల మనువాద కుట్రలను దళిత బహుజనులు పసిగట్టి రాజ్యాంగాన్ని సమగ్రంగా అర్థం చేసుకొని ఆచరిస్తే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల కన్వీనర్ సిలువేరు రవి, మండల బాధ్యులు రొడ్డ మురళీ కృష్ణ, చెన్నారావు పేట మండల కన్వీనర్ ఆలువాల శ్రీనివాస్, తెలంగాణ అంబేద్కర్ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గద్దల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుల గణన యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో సమగ్ర కుల గణన యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో బీసీల ఆర్థిక సామాజిక కుల గణన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, 60 రోజుల్లో సర్వే పూర్తి చేసి డిసెంబర్ 9 లోపు నివేదికను సమర్పించాలని ఆదేశించారన్నారు. కానీ, రాష్ట్రంలో కేవలం బీసీల కులగణన చేస్తేనే సరిపోదని రాష్ట్రంలోని సమస్త కులాల ఆర్థిక రాజకీయ సామాజిక విద్యా పరమైన మొదలైన అంశాలతో కూడిన సమస్త కులాల జనగణన జరగాలని, అన్ని కులాల జనాభా లెక్కలు నికరంగా తేల్చాలన్నారు. అప్పుడు మాత్రమే ఆయా కులాల జనాభా ప్రాదిపదికన వారి అభివృద్ధికి సంక్షేమానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. తరతరాలుగా అన్ని రంగాల్లో అణిచివేతకు, అవమానాలకు, అన్యాయాలకు గురైన బీసీలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తూతూ మంత్రంగా కాకుండా శాస్త్రీయమైన పద్ధతిలో అన్ని కులాల జనాభా లెక్కలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. సమగ్ర కుల గణన పూర్తి అయిన తర్వాతే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నంగునూరులో ఘనంగా సద్దుల బతుకమ్మ



**వరంగల్ వాయిస్, సిద్దిపేట :** తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ. మహిళలు తొమ్మిది రోజుల పాటు తిరొక్క పూలను సేకరించి భక్తి శ్రద్ధలతో వేడుకలను జరుపుకుంటారు. తెలంగాణ సాంస్కృతి తెలంగాణ ప్రతీక బతుకమ్మ పండుగ, అటువంటి పండుగ తెలంగాణ సాంప్రదాయం బతుకమ్మ పండుగను నంగునూరు మండల కేంద్రంలో ఆడపడుచులు ఆటపాటలతో అంబరాన్ని అంటే సంబరంగా సద్దుల బతుకమ్మను వాడవాడలా గౌరమ్మ పాటలు పాడుకుంటూ దేవుని పాటలతో అందరూ సంతోషంగా ఉండాలని బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీకి చెందిన నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా, శిశు వయోవృద్ధుల శాఖ జిల్లా అధికారిగా జయంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ మహిళా, శిశు వయోవృదుల శాఖ జిల్లా అధికారిగా జె.జయంతి పదోన్నతిపై జనగామ జిల్లా నుంచి హనుమకొండ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆ శాఖ ఉద్యోగులు ఆమెను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆస్ట్రేలియాలో తెలంగాణ తెలుగు తేజం




**వరంగల్ వాయిస్, ఆస్ట్రేలియా :** ఆకుల నరేష్–సహజ ఏకైక కుమారుడు ఆకుల ప్రీతం తేజస్వి హైస్కూల్ నయీం నగర్, హనుమకొండ లో పదవ తరగతి, హైదరాబాద్ లో ఇంటర్ పూర్తి చేసి ఆస్ట్రేలియా లోని ఆర్ఎంఐటీ విశ్వవిద్యాలయం లో బ్యాచిలర్ ఆఫ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2024 సంవత్సరానికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విద్యార్థి గ్రాడ్యుయేట్ ఎంటర్ప్రెన్యూర్ ప్రథమ అవార్డును గెలుచుకొని ఆస్ట్రేలియాలో తెలంగాణ గౌరవాన్ని పెంచారు.

## పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ బతుకమ్మ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా జేఏసీ, తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళా నాయకులు తాడిశెట్టి సుప్రజా, మధుర కవి విజయశ్రీ, ఎతిపతి శ్రీలత, పర్శ నాగలక్ష్మి, పవిత్ర, జనానమ్మ భారీ బతుకమ్మను తయారు చేయడం జరిగింది. బతుకమ్మను మార్కాజీ స్కూల్ సెంటర్ లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రదర్శనకు పెట్టడం జరిగింది. బతుకమ్మలకు సమగ్ర కుల గణనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని లేదా ఓబీసీ ఎస్సీ, ఎస్టీలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ స్టికర్ లతో డిమాండ్ చేశారు. కార్యక్రమ నిర్వహణలో కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్, యతిపతి నితిన్, మామిడి రాకేష్, అనిశెట్టి సాయి తేజ, కొండి కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## బస్వరాజు సారయ్య ఇంట్లో బతుకమ్మ సంబరాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య –లక్ష్మి స్వగృహంలో బస్వారాజ లక్ష్మి, శిరీష చేతుల మీదుగా బతుకమ్మ పేర్చారు. ఈ సందర్మంగా 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష మాట్లాడుతూ పూలను పూజించే, ప్రకృతిని దేవతగా ఆరాధించే మన సంస్కృతి, సాంప్రదాయ పండుగ బతుకమ్మ అని అన్నారు. ఆడపడుచులు తీరొక్క పూలతో కన్నుల పండుగగా చేసుకొనే గొప్ప పండగ మన బతుకమ్మ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంజీఎంలో బ్రాంకోస్కోపి చికిత్స



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రమాదవశాత్తూ ఊపిరితిత్తులలో చేరిన పల్లి గింజను బ్రాంకోస్కోపి ద్వారా తొలగించి చిన్నారి ప్రాణాలను ఎంజీఎం వైద్యులు కాపాడారు. సంక్లిష్ట మైన ఈ చికిత్సను ఈఎన్ టీ, మత్తు వైద్యుల బృందం సమర్ధవంతంగా నిర్వహించారు. చికిత్స సమయంలో ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉన్నప్పటికీ సురక్షితంగా పూర్తి చేశారు. మల్లంపల్లి వాస్తవ్యులు అయిన అబ్దుల్ సమద్, తండ్రి ఎండీ సర్దాం హుస్సైన్ అనే రెండు సంవత్సరాల బాలుడు ఒక వారం రోజుల నుంచి దగ్గు, ఆయాసంతో బాధపడుతూ ఉన్నాడు. వారు చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రిలో నిన్న చేరారు. వారికి సీటీ స్కాన్ చేసి చూడగా, బాలుని కుడివైపు ఊపిరితిత్తి (రైట్ బ్రంచుస్ ) లో వేరుశనగ పప్పు గుర్తించడం జరిగింది. ఆ వేరుశనగ పప్పుని బ్రాంకోస్కోపి పద్ధతిలో తొలగించడం జరిగింది. ఈ ఆపరేషన్ డాక్టర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈఎన్ టీ బృందం, డాక్టర్ జాషువా, డాక్టర్ రామ్ లాల్ అనస్తీషియా బృందం సహకారంతో చేయడం జరిగింది. ఈ వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డా.సీహెచ్ మురళి అభినందించారు.



# మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలి

### ఎస్పీ కిరణ్ ఖరే



**వరంగల్ వాయిస్, మహముత్తారం :** మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. గురువారం ఎస్పీ అడవి ముత్తారం పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పని తీరు తెలుసుకుని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. పోలీసులు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, ప%ష%ఎస్ కేసుల స్థితిగతులు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి మహేంద్ర కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా యువతను నిర్వీర్యం చేస్తున్న గంజాయి, పేకాటపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ అన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. మండలంలో మావోయిస్టులు ఎలాంటి చర్యలకు దిగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను సత్వరంగా పరిష్కరించాలని, పోలీస్ స్టేషన్ లోని రికార్డులను ఫైళ్లను సక్రమంగా నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ జి.రామ్మోహన్ రెడ్డి, కాటారం సీఐ నాగార్జున రావు, స్థానిక ఎస్ఐ మహేంద్ర కుమార్, సీసీ ఫసియొద్దీన్, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# దాండియాతో మార్వాడీల సందడి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దసర శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలో మార్వాడీల సందడి నెలకొంది. నాగ కన్య దేవాలయం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో భవాని మాతా నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సిక్వాల్ బ్రహ్మన్ సమాజ్ (మార్వాడీ సమాజ్) వారి ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ప్రతి ఏటా జరుపుకుంటారు. ఎన్నో ఏళ్లు ప్రాచీనం గల ఈ దేవాలయంలో మార్వాడీలు గత ముప్పై ఏళ్లుగా దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఏర్పాటు చేసి భక్తి పారవశ్యాన్ని చాటుకుంటారు. ప్రతి రోజు అమ్మవారికి నిత్యపూజలు, నైవేద్యాలతో పూజలు అందిస్తు అమ్మవారి ఆశిస్సులు పొందుతున్నారు. నాగకన్య దేవాలయం అనుసంధానంగా సాగుతున్న ఈ భవాని మాత నవరాత్రుల పండుగకు ఓప్రత్యేక ఉందని ఇక్కడి మార్వడి వాసులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు కాని వారికి నాగకన్య ఓ వరంలా ఆవిర్భవించిందని అమ్మవారిని దర్శించుకున్న తరువాత అనేక కుటుంబాలకు సంతానం కల్పించి సంతాన లక్ష్మిగా పేరుగాచిందన్నారు. అందుకే ఇక్కడ సమస్త జన భక్తులు భవాని మాత రూపంలో కొలవడం ఇక్కడి ప్రాంతవాసులు ప్రగాఢ నమ్మకం అని చెప్పుకోవచ్చు.



# ఇందిరా మహిళా శక్తి లక్ష్యం చేరుకోవాలి



### పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాన్ని చేరుకోవాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు, ఇందిరా మహిళా శక్తి పథకం అమలు తీరుపై హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓలు, మెప్మా బాధ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ మాట్లాడారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యక్తిగత, గ్రూప్ ల వారీగా మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యక్తిగత, గ్రూప్ లకు కలిపి 17,500 యూనిట్స్ ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత యూనిట్స్ లక్ష్యం 15,000 కాగా, రుణం రూ. 52.53 కోట్లు, గ్రూప్ యూనిట్స్ లక్ష్యం 2,500 కాగా, రూ. 500 కోట్ల రుణాలు లక్ష్యమని వెల్లడించారు. వ్యక్తిగత యూనిట్స్ ఇప్పటిదాకా 4,248 గ్రౌండింగ్ పూర్తి అయ్యాయని వివరించారు. ఆయా యూనిట్స్ ఏర్పాటుపై మహిళా సంఘాల బాధ్యులతో మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతినెలా టార్గెట్ నిర్ణయించి, ముందుకు వెళ్లాలని ఆదేశించారు.

### ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయాలి..

ఎల్ ఆర్ ఎస్ అప్లికేషన్లో పరిష్కారానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక టీములు ఏర్పాటు చేయాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అప్లికేషన్లు పరిష్కరించకపోవడం వారితో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఆయా జిల్లాల్లో వచ్చిన మొత్తం అప్లికేషన్స్ ఎన్ని? పరిష్కారానికి అర్హత సాధించినవి ఎన్నో ఆరా తీశారు. మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు ప్రతి పనికి గడువు విధించి పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి గణేష్, ఎల్ఆర్ఎస్ నోడల్ ఆఫీసర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పువ్వుల పండుగ











# మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుపై అవగాహన సదస్సును గురువారం మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా అడిషనల్ డీసీపీ సురేష్ హాజరయ్యారు. మెడికవర్ హాస్పిటల్స్ నుంచి స్పీకర్స్ గా డాక్టర్ బీఎస్జీ వశిష్ఠ- కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, డా. తెలుగు రామకృష్ణ - కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్, ప్యానెల్ మెంబెర్ గా డాక్టర్ ప్రియాంక డి-కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ పాల్గొనటం జరిగింది. అనంతరం ముఖ్య అతిథి మాట్లాడుతూ మనం శారీరక ఆరోగ్యానికి ఇచ్చిన ప్రాధాన్యత మానసిక ఆరోగ్యానికి ఇవ్వడం లేదన్నారు. మనం నిర్లక్ష్యం చేసే రోజువారీ అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని దిగజారుస్తున్నాయి. యువత చాలా మంది చేదు అలవాట్లపై వ్యామోహం పెంచుకుంటున్నారు. ఇది మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ వశిష్ఠ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా మందికి జీవితంలో తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. ఇది మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. నేటి కాలంలో మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడమే పెద్ద సమస్యగా మారుతోంది. చాలా సందర్భాల్లో ఒత్తిడి పెరిగి డిప్రెషన్‌గా మారుతుంది. సమస్య మరింత తీవ్రంగా మారినప్పుడు ఈ సందర్భాలలో బాధితుడు కొన్నిసార్లు ఆత్మహత్య వంటి ప్రాణాంతక చర్యలు తీసుకుంటాడు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి దాని గురించి స్వయంగా తెలియదన్నారు. కుటుంబ సభ్యులు ఎప్పుడైతే వ్యక్తిలో మార్పులు కనిపిస్తాయో వెంటనే గుర్తించి సరైన చికిత్స అందించడం ఉత్తమమన్నారు. ఈ కార్యక్రమంలో మెడి కవర్ హాస్పిటల్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడ్వాలపల్లిలో తీజ్ సంబురాలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని అడ్వాలపల్లి లంబాడి తాండాలో బతుకమ్మ పండుగ సందర్భంగా గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోధుమ నారు బుట్టల వద్ద మహిళలు ఆడి పాడి సంబరాలు జరుపుకున్నారు. ఈ తీజ్ ఉత్సవాలలో గ్రామ పెద్దలు భూక్య గోపి నాయక్, అజ్మీరా అకిరాం నాయక్, మాజీ సర్పంచ్ బానోత్ రాజు నాయక్, అజ్మీర బాలాజీతో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీఐలుగా బాధ్యతల స్వీకరణ







**వరంగల్ వాయిస్, క్రైం :** హనుమకొండ నూతన ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్‌గా సీతారెడ్డి, వరంగల్ ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ సీఐగా సుకూర్, గీసుగొండ పోలీస్ స్టేషన్ లో సీఐగా ఏ.మహేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

## ఘనంగా నిట్ వరంగల్ 66వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్, (రీజనల్ ఇంజినీరింగ్ కాలేజ్ వరంగల్) 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ (ఎఎల్సీ)లో గురువారం జరుపుకున్నారు. హైదరాబాదులోని డీఆర్డీఓలో విశిష్ట శాస్త్రవేత్త, క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్, ముఖ్య అతిథి యు.రాజా బాబు సమక్షంలో ఉత్సవాలు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమయ్యాయి. తన ప్రసంగం, “యుద్ధంలో సాంకేతికతలో కొత్త పోకడలు”, ఆత్మ నిర్భర్ భారత్‌ను సాధించడంలో, ముఖ్యంగా దేశ రక్షణ రంగంలో ఆవిష్కరణల కీలక పాత్రను నొక్కి చెప్పింది. ఎన్ఐటీ వరంగల్‌కు 1959లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పునాది రాయి వేశారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న 31 ఎన్ఐటీలలో పురాతనమైంది. ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో అధ్యాపకులు, విద్యార్థుల ముఖ్యమైన సహకారాన్ని హైలైట్ చేశారు. వీడియో ప్రదర్శన ద్వారా సంస్థ విజయాలు, ఉన్నత విద్య, పరిశోధనపై దాని ప్రభావాన్ని ప్రదర్శించారు. క్యాంపస్ లైఫ్ సారాంశాన్ని సంగ్రహించే కాఫీ టేబుల్ పుస్తకాన్ని కూడా బాబు విడుదల చేశారు. విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డులు- 2024 వారి వృత్తిపరమైన నైపుణ్యం ప్రదర్శించిన ప్రముఖ పూర్వ విద్యార్థులకు అందించబడ్డాయి. ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ అలుమ్ని అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు అవార్డు గ్రహీతల విజయాలను హైలైట్ చేశారు. కొంతమంది ఎంపిక చేసిన అధ్యాపకులు తమ పరిశోధన కోసం ప్రపంచంలోని టాప్ 2శాతం స్టాన్‌ఫోర్డ్ పరిశోధకుల జాబితాలో గుర్తించబడినందుకు గౌరవించబడ్డారు. పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యకలాపాలు రెండింటిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, వారి అంకితభావం, విజయాలను పురస్కరించుకుని ఎండోమెంట్ అవార్డులు కూడా అందించబడ్డాయి. అనంతరం పీఆర్ మోహన్ అవార్డుల పంపిణీ, అస్మాన్ అవార్డు, ఫౌండేషన్ డే క్విజ్ బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ అలుమ్ని అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల వ్యవహారాల అసోసియేటెడ్ డీన్ ప్రొఫెసర్ టి.మహేష్, వారి బృందం ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసింది.

# మళ్లీ తెరపైకి పూర్ణా మార్కెట్








అక్కినేని నాగార్జున హీరోగా నటించిన శివమణి సినిమాలో వచ్చే పూర్ణా మార్కెట్ ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే చాలా రోజుల తర్వాత పూర్ణా మార్కెట్‌ను సిల్వర్ స్క్రీన్‌పై మరోసారి చూడబోతున్నారు టాలీవుడ్ సినీ జనాలు. ఇంతకీ ఎలా అనే కదా మీ డౌటు. వరుణ్ తేజ్ నటిస్తోన్న మట్కా సినిమా కోసం వింటేజ్ వైజాగ్ బ్యాక్ డ్రాప్‌లో పూర్ణా మార్కెట్ (ప్రస్తుతం లేదు)తోపాటు పలు ప్రాంతాలను రిక్రియేట్ చేశారు. పూర్ణా మార్కెట్.. మట్కా.. బిహైండ్ ది గేమ్.. యాక్ట్ 1 అంటూ మేకర్స్ ఓ వీడియోను రిలీజ్ చేశారు. పూర్ణా మార్కెట్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతున్నట్టు విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. మట్కా కోసం మేకర్స్ ఇప్పటికే 1980 బ్యాక్‌డ్రాప్ వైజాగ్ లొకేషన్స్ రిక్రియేషన్‌కు సంబంధించి లాంచ్ చేసిన స్పెషల్ గ్లింప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పలాస 1978 ఫేం కరుణకుమార్ దర్శకత్వంలో పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని నవంబర్ 14న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు తెలియజేస్తూ.. వరుణ్ తేజ్ సూట్‌లో సూపర్ స్టైలిష్‌గా సిగరెట్ తాగుతూ.. మెట్లు దిగుతున్న పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు.





# త్వరలో మహాకాళి

హనుమాన్’ తో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌లో వరుస చిత్రాలు వస్తాయని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ క్రమంలో జై హనుమాన్ రూపొందుతున్నట్లు ప్రకటించి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచారు. ఈ నేపథ్యంలో ఈ యూనివర్స్‌లో తానోక్కడినే కాకుండా ఇతరుల దర్శకత్వం లోనూ సినిమాలు వస్తాయని తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఈ యూనివర్స్‌లో మూడో చిత్రంగా ఫస్ట్ ఇండియన్ ఉమెన్ సూపర్ హీరో చిత్రం మహాకాళి రాబోతున్నట్లు తాజాగా ఈ రోజు (గురువారం) అధికారికంగా ప్రకటించి సినిమా ఎనౌన్స్‌మెంట్ గ్లిమ్స్ విడుదల చేశారు. ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ మూవీకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తుండగా దుగ్గల్ సమర్పణలో స్టూడియోస్ బ్యానర్‌పై రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ సినిమాను పాన్ ఇండియాగా ఐమాక్స్ 3డీలో విడుదల చేయనున్నారు. బెంగాల్ నేపథ్యంలో ఆధ్యాత్మిక మరియు పౌరాణిక అంశాలను మిళితం చేస్తూ అద్భుతమైన విజువల్స్, ఎమోషనల్ గ్రిప్పింగ్ కథనంతో ఈ ‘మహాకాళి’ అనే సినిమాను తెరకెక్కిస్తున్నట్లు ప్రకటించారు. ఇది భారతదేశం నుంచి వస్తున్న మొదటి మహిళా సూపర్ హీరో చిత్రం, విశ్వంలోనే అత్యంత క్రూరమైన సూపర్ హీరో చిత్రంగా మేకర్స్ అభివర్ణించారు. తజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ఒక అమ్మాయి తన తలను పులికి తాకించి ఉండడం బ్యాగ్రౌండ్‌లో విలేజ్ సెటప్ ఉండి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.



# ఓటీటీ ప్లాట్‌ఫాంపైకి వెట్టైయాన్



తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించిన చిత్రం వెట్టైయాన్. జై భీమ్ ఫేం టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ మూవీ నేడు ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. వెట్టైయాన్ మిక్స్‌డ్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. కాగా ఇప్పుడిక డిజిటల్ ప్లాట్‌ఫాంకు సంబంధించిన వార్త బయటకు వచ్చింది. వెట్టైయాన్ పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రీమియర్ కానుంది. అమెజాన్ ప్రైమ్ భారీ మొత్తానికి ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్ దక్కించుకున్నట్టు సమాచారం. అయితే ప్రీమియర్ తేదీపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ మూవీలో దుషారా విజయన్, రితికా సింగ్ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. ఫహద్ ఫాసిల్, మంజు వారియర్, రానా దగ్గుబాటి, రావు రమేశ్, రోహిణి మొల్లేటి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుబాస్కరన్ తెరకెక్కించారు.

# వీడ్కోలు మిత్రమా..!

**రతన్ టాటా మాజీ ప్రేయసీ, బాలీవుడ్ నటీ సిమి గరెవాల్**

దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ గౌరవ చైర్మన్ రతన్ టాటా మరణం యావత్తు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. రతన్ టాటా మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రతన్ టాటా మరణం పట్ల ఆయన మాజీ ప్రేయసి, బాలీవుడ్ నటి సిమి గరెవాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మీరు ఇక లేరని అంటున్నారు. ఆ లోటు భరించడం చాలా కష్టం.. వీడ్కోలు మిత్రమా’ అంటూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటి అయిన సిమి గరెవాల్ గతంలో రతన్ టాటాతో ప్రేమలో పడ్డారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడిరచారు. రతన్ టాటాతో సన్నిహితంగా మెలిగినట్లు తెలిపారు. ఆ తర్వాత విడిపోయామని, అప్పటి నుంచి మంచి స్నేహితులుగా కొనసాగుతున్నట్లు వెల్లడిరచారు. రతన్ టాటా ఇప్పటికీ అవివాహితుడు. నాలుగు సార్లు పెళ్లి దాకా వచ్చారు కానీ మూడు ముళ్ల బంధంతో ఒక్కటి కాలేదు. లాస్ ఏంజెల్స్‌లో ఉన్నప్పుడు ఒకమ్మాయితో ప్రేమలో పడ్డాను అని టాటా చెప్పారు. 1962 ఇండో..చైనా యుద్ధం కారణంగా ఆమె తల్లిదండ్రులు ఇండియాకు పంపించేందుకు అంగీకరించలేదు. అలా లవ్ మ్యారేజ్‌కు బ్రేక్ పడిరదని తెలిపారు.

# దుర్గామాతగా అమ్మవారు

- ఎనిమిదో రోజుకు చేరిన దేవిశరన్నవరాత్రోత్సవాలు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవిశరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం ఎనిమిదో రోజు అమ్మవారిని దుర్గ మాతగా అలంకరించి పూజారాధనలు జరిపించారు. ఈ రోజు భద్రకాళీ జన్మోత్సవం సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేక అర్చనాదులు, జపహోమాలు నిర్వహించారు. భద్రకాళీ విశ్వమంతా వ్యాపించి ఉన్నప్పటికీ కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా ప్రసిద్ధి చెందిన తెలంగాణలోని వరంగల్ మహానగరంలో దుర్గాష్టమి నాడు కోటి యోగినీ గణములతో అవతరించడం వల్ల ఈ ప్రాంతం ఒక పవిత్రతను సంతరించుకుందని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ రోజు స్త్రీలందరూ అమ్మవారికి చద్దులు చేసి నివేదించడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే చద్దుల బతుకమ్మ పండుగ అయిందని ప్రచారంలో ఉంది. ఈ రోజు ఉదయం అమ్మవారికి భద్రపీఠ సేవ, సాయంకాలం అశ్వవాహన సేవలు జరిపించారు. భద్రపీఠంపై ఊరేగుతున్న అమ్మవారిని దర్శించిన భక్తులకు భద్రములు, శ్రేయస్సు, సంపద, ముక్తిని ప్రసాదిస్తుందని, అశ్వ వాహనం మీద ఊరేగుతున్న అమ్మవారి దర్శనం లక్ష్మి ప్రాప్తిని, పరాక్రమమును కలిగిస్తుందని ఆలయప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు అమ్మవారి విశేష అలంకరణకు భారతి విద్యా సంస్థల అధినేతలు ఇరుకుళ్ళ సంజయ్ కుమార్–జయశ్రీ దంపతులు, సుహాస్–శ్రీనిధి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయ దాతలకు ఆలయ ఈఓ శేషుభారతి శేష వస్త్రములు బహుకరించి ప్రసాదములు ఆందజేశారు. సాయంకాలం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్నాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంత గానో అలరించాయి.

# కాంట్రాక్టర్ల వలలో.. ఘనప సముద్రం చేపలు

**నష్టపోతున్న మత్స్యకారులు**

**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయ రాజులు గణపురం మండల కేంద్రంలో నిర్మించిన ఘనప సముద్రం చేపలు కాంట్రాక్టర్ల వలలో చిక్కుకుపోతున్నాయి. ఈ మేరకు కాంట్రాక్టర్ చేపలు అమ్మడానికి బలవంతంగా తీర్మానం చేయించుకున్నట్లు మత్స్య కార్మికులు చెబుతున్నారు. సంఘ పెద్దలు కొందరి ఆధ్వర్యంలో ఇది జరిగినట్లు ప్రచారం సాగుతోంది. పథకం ప్రకారమే కొందరు మత్స్య కార్మికులను బజారు పాలు చేసేందుకు ఈ కుట్ర పన్నారన్న ఆరోపణలున్నాయి. కావాలని కాంట్రాక్టర్ చేత ఐదు లక్షల చేప పిల్లలు, రొయ్య పిల్లలను చెరువులో పోయించినందుకుగాను కిలో చేప పిల్లలను రూ. 60, కిలో రొయ్య పిల్లలకు రూ.120 చొప్పున మత్స్యకారులు కాంట్రాక్టర్లకు అమ్మడానికి తీర్మానం చేశారని చెబుతున్నారు. కాగా గణపురంలో చెరువులో కాంట్రాక్టర్ చేత చేప పిల్లలను పోయడంతోపాటు చేపలు, రొయ్యలకు కాంట్రాక్టర్ చెప్పిన ధరకు అమ్మడాన్ని గణపురం మత్స్యకారులు పలువురు వ్యతిరేకించారు. గణపురం ఫిషరీ సొసైటీలో కాంట్రాక్టర్లు, మధ్య దళారులు చొరబడి మత్స్యకారుల పొట్ట కొట్టేందుకు ప్రయత్నం చేయడంతో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఇప్పుడు మత్స్యశాఖ వారు జోక్యం చేసుకొని చెరువుపై కాంట్రాక్టర్ పెత్తనాన్ని తొలగించి మత్స్యకారులు మార్కెట్ లో స్వేచ్ఛగా చేపలు, రొయ్యలను గిట్టుబాటు ధరలకు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు.



# బిందు సేద్యంతో అధిక దిగుబడులు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- గీసుగొండ, ఖిలా వరంగల్ మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు తీసేందుకు బిందు సేద్యం ఎంతగానో ఉపకరిస్తుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ పద్ధతి వల్ల నీటిని ఆదా చేయడంతో పాటు అధిక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని మొగిలిచర్ల, ఖిలా వరంగల్ మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు అమలు చేస్తున్న బిందు సేద్యం విధానాన్ని పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిందు సేద్యం పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు పరికరాలు మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సంగీతలక్ష్మి, ఉద్యాన అధికారి తిరుపతి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ రామ్ చరణ్ తేజ, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా కేశవమూర్తి జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి 59వ జన్మదిన వేడుకలు కడువైభవంగా జరిగాయి. గురువారం ఉదయం హనుమకొండ జేఎన్ఐఎస్ స్టేడియంలో షటిల్ కోచ్ కూరపాటి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో షటిల్ క్రీడాకారులు కొలుగూరి ప్రభాకర్ రావు, వైవి రాజేందర్, కొత్తగట్టు సుధాకర్, పూజారి విజయకుమార్, కోమాకుల మధుకర్, పీచు రాజిరెడ్డి, గుడి దేవేందర్ రెడ్డి, తమ్ముడు పెల్లి రాజు, వీసం మహేందర్ రెడ్డి, చల్లా రాజు, సురభి కిరణ్, చోల్లేటి సంపత్, లకావత్ తిరుపతి, కె.మోహన్ రావు, ఎస్.విద్యాసాగర్, రమణారెడ్డి, బాబర్ ఖాన్, రాజు ప్రసాద్, పూజారి శ్రీను, గంధసిరి అశోక్, విపిన్ తదితరులు పాల్గొన్నారు. కేశవమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం కేశవమూర్తి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు అల్లం రాజేశ్‌వర్మ ఆధ్వర్యంలో వరంగల్ వాయిస్ పత్రిక కార్యాలయంలో జరిగిన జన్మ దిన వేడుకల్లో సీనియర్ జర్నలిస్టులు సామల సూర్య ప్రకాశ్, అనుముల ప్రభాకర్, పిట్ట శ్రీకాంత్, ఈగ సురేందర్, రవి, అంకతి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లం రాజేష్ వర్మ, అనుముల ప్రభాకర్ వేర్వేరుగా గడ్డం కేశవమూర్తికి పెన్ను బహుమతిగా ఇచ్చారు.







## మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరగాలి

మానసిక ఆరోగ్యం అనేది మన భావోద్వేగ, మానసిక, సామాజిక శ్రేయస్సులో ముఖ్యమైన భాగం. ఇది మనం ఎలా ఆలోచిస్తామో, అనుభూతి చెందుతామో, ప్రవర్తించే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. వ్యక్తిగత ఎదుగుదలకు, వ్యక్తిగత లక్ష్యాలను సాధించడానికి మానసిక ఆరోగ్యం ముఖ్యం. మంచి మానసిక ఆరోగ్యం ఇతరులతో ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచుకోవడానికి, నిర్వహించడానికి సహాయపడుతుంది. మానసికంగా స్థిరంగా, మానసికంగా దృఢంగా ఉన్న వ్యక్తి కష్టమైన భావోద్వేగ పరిస్థితులను సులభంగా ఎదుర్కొగలడు. భావోద్వేగ స్థితి స్థాపకతను సాధించడానికి శారీరక దృఢత్వం కూడా అవసరం. మానసిక ఆరోగ్యం లోతైన వ్యక్తిగత విషయం అయితే, వివిధ కారకాలు ప్రజలను వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. కొన్ని సాధారణ అంశాలు మానసిక ఆరోగ్య సవాళ్లకు దోహదం చేస్తాయి. నిరాశ, దూకుడు, ప్రతికూల ఆలోచన, నిరాశ, భయం వంటి భావోద్వేగాలు మన మొత్తం శ్రేయస్సును గణనీయంగా ప్రభావితం చేస్తాయి. మనం శారీరక అనారోగ్యాన్ని అనుభవించినట్లే, మానసిక ఆరోగ్య సమస్యలతో కూడా బాధపడవచ్చు. మానసిక అనారోగ్యం భావోద్వేగాలు, ఆలోచనలు, ప్రవర్తనలలో అంతరాయాలతో వర్గీకరించబడుతుంది. ఇది ఒత్తిడి, బాధాకరమైన సంఘటనలు, శరీరంలో జీవరసాయన అసమతుల్యత, బాల్యంలో జరిగిన దుర్ఘటనల వలన కలిగిన మానసిక గాయం, సామాజిక ప్రతికూలతలు, శారీరక ఆరోగ్య పరిస్థితులతో సహా వివిధ మూలాల నుంచి ఉత్పన్నమవుతుంది.

### సవాలుగా మానసిక ఆరోగ్య సమస్యలు..

మానసిక ఆరోగ్య సమస్యల అనేక లక్షణాలు వ్యక్తి నుంచి వ్యక్తికి, వివిధ రకాల సమస్యలలో విభిన్నంగా ఉంటాయి. ఉదాహరణకు, తీవ్ర భయాందోళనలు, ఆలోచనలు సాధారణ దుష్ప్రభావాలు. ఈ మానసిక ఒత్తిడి ఫలితంగా, ఒక వ్యక్తి గుండె తీవ్రంగా కొట్టుకోవడం జరుగుతుంది. మానసిక ఆరోగ్యం సరిగ్గా లేదు అనడానికి మరొక సంకేతం ఏకాగ్రత లేకపోవడం. మీరు మీ జీవితంలో ఒకేసారి చాలా ఎక్కువ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నపుడు ఇది సంభవిస్తుంది. మీరు ఆలోచనా రహితంగా తప్పులు చేయడం ప్రారంభించి, ఫలితంగా సమర్థవంతంగా దృష్టిపెట్టే సామర్థ్యాన్ని కోల్పోతారు. ప్రజలు శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుండగా, వారు తరచుగా వారి మానసిక శ్రేయస్సును నిర్లక్ష్యం చేస్తారు. సత్సంబంధాలు, సరైన పనితీరు ఫలితాల కోసం మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా కీలకం. మానసిక ఆరోగ్య సవాళ్లను సమర్థవంతంగా నిర్వహించడంలో ఈ మద్దతు కీలకం. మీరు ఎదుర్కొనే ఏవైనా సమస్యలను మెరుగ్గా పరిష్కరించడానికి మానసిక ఆరోగ్యం గురించి మీరే అవగాహన పెంచుకోండి. కుటుంబం, స్నేహితుల నుంచి భావోద్వేగ మద్దతును కోరండి. క్రమం తప్పకుండా కృతజ్ఞతా భావాన్ని పాటించండి. మీరు ఆనందించే హాబీలు లేదా సృజనాత్మక కార్యకలాపాలలో పాల్గొనడం కూడా మీ మానసిక క్షేమానికి సానుకూలంగా దోహదపడుతుంది.

### వ్యాయామంతో శారీరక, మానసిక దృఢత్వం..

ఎవరైనా శారీరకంగా దృఢంగా ఉండగలరు, మంచి మానసిక స్థితిని కలిగి ఉండగలరు. ఒత్తిడి, భావోద్వేగ సవాళ్లను మరింత సమర్థవంతంగా నిర్వహించగలరు. రెగ్యులర్ ఫిజికల్ యాక్టివిటీ శారీరక ఆరోగ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక దృఢత్వానికి తోడ్పడుతుంది. మెంటల్ ఫిట్‌నెస్ మానసిక సమతుల్య స్థితిని సూచిస్తుంది. ఇది జీవితాన్ని ఆస్వాదించగల మన సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా మనం ఎలా భావిస్తున్నామో, ఆలోచిస్తాం, ప్రవర్తిస్తామో అనే దానిపై సానుకూల దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ స్థితి స్వీయ–నిర్ణయ భావాన్ని పెంపొందిస్తుంది. ప్రతికూల ఆలోచనలను చురుకైన, సానుకూలమైన వాటితో భర్తీ చేయడానికి అనుమతిస్తుంది.



**బాల్నె పూర్ణిమ,** సైకాలజిస్ట్
దక్ష చైల్డ్ డెవలప్ మెంట్ సెంటర్
9121749009/9502499393

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com